క్లుప్తంగా

ప్రారంభమైన గ్రామదేవతల ఆలయ వార్షికోత్సవం



నాదెండ్ల: సాతులూరు గ్రామంలో కొలువై యున్న గ్రామ దేవతల ఆలయ పదో వార్షికోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. పోలేరమ్మ, మునిబంధమ్మ, వినుకొండ అంకమ్మ, ఊరఅంకమ్మ, మహాలక్ష్మమ్మ, నాభిశిలలకు తొలిరోజు భక్తులు సాంప్రదాయబద్ధ మేళతాళాలతో పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ఉదయాన్నే ఘటం కుండ ఊరేగింపు నిర్వహించారు. 5వ తేదిన వసంతోత్సవం, ఆరో తేదిన పొంగళ్లు పొంగించి నైవేద్య సమర్పణ, అదేరోజు భారీ అన్నదాన కార్యక్రమం, ఏడున మొక్కుబడులు, 8న సిడిమానోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 9 గంటలకు ఆలయం వద్ద భజన కార్యక్రమాలు జరగనున్నాయి.

ఎంఏఎం కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు



నరసరావుపేట రూరల్: ఎంఏఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బెంగళూరుకు చెందిన స్టాండ్ ఫర్ యూ సొల్యూషన్స్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఎనిమిది మంది విద్యార్థినులు ఉద్యోగాలు సాధించినట్టు కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య తెలిపారు. కళాశాలలో శుక్రవారం సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేసినట్టు తెలిపారు. ఏడుగురు కంప్యూటర్ సైన్స్, ఒక్కరు ఎలక్ట్రానిక్స్ విభాగం నుంచి ఎంపికై నట్టు వివరించారు. విద్యార్థులు రూ.4లక్షల వార్షిక వేతనం పొందనున్నారని తెలిపారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ మేదరమెట్ల శేషగిరిరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జె.రవిశంకర్, విభాగాధిపతులు రాధికా, ఫణిబాబు, సితార, నవీన్‌లు అభినందించారు.

స్టడీ మెటీరియల్స్ పంపిణీ



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల 10వతరగతి విద్యార్థులకు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను యడవల్లి సత్యనారాయణ శర్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా అందజేశారు. విశ్వసాయి జూనియర్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ యడవల్లి శ్రీనివాస్‌శర్మ, ప్రిన్సిపాల్ పావనిలు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని మంచిఫలితాలు సాధించాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం కె.నాగలక్ష్మి, రిటైర్డ్ హెచ్‌ఎం ఎ.నాగేశ్వరరావు, భాగవతుల రవికుమార్, ఎ.రామారావు తదితరులు పాల్గొన్నారు.

డీటీ నాగరాజు సేవలు అభినందనీయం



శావల్యాపురం: రెవెన్యూసేవలు ప్రజలకు పారదర్శకంగా అందించి అందరి మన్ననలు పొందటం అభినందనీయమని తహసీల్దార్ కె.సుజాత అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దారు వేముల వెంకట నాగరాజు పదోన్నతిపై క్రోసూరు మండల తహసీల్దారుగా నియమాకం అయిన సందర్భంగా వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. వెంకట నాగరాజును పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. డిప్యూటీ సర్వే అధికారి పేరిసోముల నాసరయ్య, ఆర్ఐ చంద్రబాబు, వీఆర్వోల సంఘం అధ్యక్షుడు ఉప్పలూరి చిన మంగయ్య, మల్లెల రాధ, వీరవల్లి నాగ సంతోష లక్ష్మి, దూపాటి దేవమ్మ, నరసింగరావు తదితరులు ఉన్నారు.

దాతల సహకారంతో బోరు ఏర్పాటు

నరసరావుపేట రూరల్: రావిపాడులోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి ఆలయంలో శుక్రవారం దాతల సహకారంతో బోరు ఏర్పాటు చేశారు. పట్టణానికి చెందిన కొత్త వెంకటేశ్వర్లు, పార్వతి దంపతులు బోరు ఏర్పాటుకు రూ.27వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో వాసవి మిత్ర మండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతు జనబాంధవుడు సోమేపల్లి సాంబయ్య

శాసమండలి సభ్యుడు మర్రి రాజశేఖర్



మాజీ ఎమ్మెల్యే సోమేపల్లి సాంబయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ తదితరులు

చిలకలూరిపేట: రైతు జనబాంధవుడు సోమేపల్లి సాంబయ్య అని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పేర్కొన్నారు. దివంగత మాజీ ఎమ్మెల్యే సోమేపల్లి సాంబయ్య వర్ధంతి సందర్భంగా పట్టణంలోని భాస్కర్‌సెంటర్‌లో ఉన్న సోమేపల్లి సాంబయ్య, దివంతగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాలకు శుక్రవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ రైతు లేనిదే రాజ్యం లేదని, దేశాభివృద్ధిలో రైతు వెన్నుముక అని నమ్మి రైతుల సంక్షేమానికి సాంబయ్య ఎంతో కృషి చేశారని చెప్పారు. రాష్ట్రంలో రైతుల కోసం తొలి ఎత్తిపోతల పథకం సృష్టించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. దీంతో పాటు మూడు పర్యాయాలు నియోజకవర్గ ఎమ్మెల్యేగా పేద ప్రజల అభ్యున్నతి కోసం, వారి సంక్షేమం కోసం కృషి చేశారని కొనియాడారు. రాజకీయాలంటే ప్రజాసేవ అని నమ్మి జీవిత చరమాంకం వరకు ప్రజాసేవలో గడిపారని కొనియాడారు. రైతులతో పాటు బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి సోమేపల్లి ఎంతగానో పాటుపడ్డారని కొనియాడారు. నియోజకవర్గంలో ఏర్పాటైన అనేక పేదల కాలనీలు సోమేపల్లి సాంబయ్య ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్నవేనని తెలిపారు. నియోజకవర్గంనుంచి ప్రాతినిధ్యం వహించిన ఆయన దేశస్థాయిలో రైతు నాయకుడిగా ఎదిగారని వెల్లడించారు. ప్రజాసేవతప్ప మరోధ్యాస లేని ఆయన నేటికీ ప్రజల హృదయాల్లో చిరంజీవిగా ఉన్నారని వెల్లడించారు. మండలంలోని తాతపూడి గ్రామంలో ఉన్న సాంబయ్య విగ్రహానికి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గేరా లింకన్, ఏవీఎం సుభాని, చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, సాతులూరి కోటి, షేక్ కరిముల్లా, బి బాలకోటినాయక్, సయ్యద్ జమీర్, అత్తులూరి షరీఫ్, మొహమ్మద్ జిలాని తదితరులు పాల్గొన్నారు.

సోమేపల్లి సాంబయ్యకు ఘననివాళి..

యడ్లపాడు: రైతు బాంధవుడు స్వర్గీయ సోమేపల్లి సాంబయ్య వర్ధంతి కార్యక్రమాన్ని మండలంలోని లింగారావుపాలెం నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన సెంటర్లో ఉన్న సాంబయ్య విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆలోకం శ్రీనివాసరావు, ఆలోకం వెంకట లక్ష్మీనారాయణ, కనపర్తి సుబ్బారావు, షేక్ మాబుసుభాని, కొల్లా పేరయ్య, కావటి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, నంబూరి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



లింగారావుపాలెంలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నాదెండ్లలో...

నాదెండ్ల: మాజీ ఎమ్మెల్యే, రైతు బాంధవుడు సోమేపల్లి సాంబయ్య వర్ధంతి కార్యక్రమాన్ని ఇర్లపాడు, కనపర్రు గ్రామాల్లో నిర్వహించారు. సాంబయ్య విగ్రహాలకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. నేతలు మాట్లాడుతూ సోమేపల్లి ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో చిలకలూరిపేట నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. రైతు పక్షపాతిగా, లిఫ్ట్ ఇరిగేషన్ రూపకర్తగా నిలిచారని కొనియాడారు. కనపర్రు సర్పంచ్ పెరుమాళ్ళపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు పచ్చవ కోటేశ్వరరావు, మారె వెంకటస్వామి, పోపూరి అయ్యప్ప, గాలి జయప్రకాశ్, ఇర్లపాడు మాజీ సర్పంచ్ మంగు ఏడుకొండలు, చిన్నం జోజిబాబు, ఎడ్ల విజయబాబు, గేరా నకోను, దూమాల జోజిబాబు, చిన్నం రాజు ఉన్నారు.

వాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లిరోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో శుక్రవారం అమ్మవారి ఆత్మార్పణం (గుండ ప్రవేశం) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద హోమగుండం ఏర్పాటు చేసి అమ్మవారి గుండ ప్రవేశం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయతో ప్రజలు సుఖశాంతులతో జీవించాలని కోరుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమాసు మెహర్‌బాబు, కార్యదర్శి వెంటప్పయ్య, కోశాధికారి పాత్తూరి వెంకటలక్ష్మీ వరప్రసాదరావు, రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వనమా సాంబశివరావు, శ్రీవాసవి మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, ఆధ్యాత్మిక ప్రవచనకర్త వేమా సుబ్రహ్మణ్యంగుప్త, పూరా భాస్కరరావు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.



అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

అమ్మవారికి ప్రత్యేక పూజలు..

చిలకలూరిపేట: పట్టణంలోని చౌత్రా సెంటర్‌లో ఉన్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని పురస్కరించుకొని ఆలయంలో చండీహోమంతో పాటు వివిధ పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ చండీహోమంతో పాటు అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో గుర్రం సాంబశివరావు, మాజేటి నరేంద్ర, కొప్పురావూరి పటేల్, ఘంటశాల బంగారుగుప్తా, తులాబంధుల సుధాకర్, రావికింది సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ పట్టణంలో బోసుబొమ్మ సెంటర్ వద్ద వేంచేసి ఉన్న వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాలతో, పసుపు, కుంకుమ, వివిధ రకాల పండ్లు, పండ్లు రసాలతో ప్రధాన అర్చకులు పి.నారయణ, శ్రీనివాసరావు, చైతన్యలు అభిషేకాలు నిర్వహించారు. మహిళలు, ఆర్యవైశ్య సంఘం నేతలు, భక్తులు పాల్గొని అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు.

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో వేంచేసి ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకుడు వాకాని కోదండరామ దీక్షితులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవాసవీ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ముగిసిన పశువైద్య ఆరోగ్యశిబిరాలు

యడ్లపాడు: సాగుతో పాటు పశుపోషణ జీవనాధారంగా చేసుకొని రైతులు ఆర్థిక పరిపుష్టిని సాధించాలని యడ్లపాడు ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వై.రాధాకృష్ణ తెలిపారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వం, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశువైద్య ఆరోగ్యశిబిరాల నిర్వహణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శుక్రవారం జగ్గాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఆయన పాల్గొని ప్రారంభించారు. శిబిరంలో పశువైద్యురాలు పి.కిరణ్మయి పాల్గొని వైద్యసేవలందించారు. పశువైద్య సహాయకులు సాయిగోపికృష్ణ, లిఖిత, తుర్లపాడు గ్రామగోపాల మిత్ర వరప్రసాద్, సిబ్బంది చక్రవర్తి పాల్గొన్నారు.

నరసరావుపేట రూరల్: మండలంలోని జొన్నలగడ్డలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ములకలూరు పశు వైద్యులు డాక్టర్ ఎం.అర్జునరావు ఆధ్వర్యంలో నిర్వహించి శిబిరాన్ని పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ రామారావు, సహాయ సంచాలకులు డాక్టర్ రామచంద్రరావులు పరిశీలించారు. కార్యక్రమంలో గేదెలు, ఆవులు, దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను వేశారు. పశు సంవర్ధక సహాయకుడు పి.శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచర్ల: మండలంలో 12 రోజుల పాటు 24 గ్రామాల్లో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ శిబిరాల్లో ఆవులు, గేదెలు, గొర్రెలు, కోళ్లకు వివిధ రకాల చికిత్సలు నిర్వహించామని పశు వైద్యాధికారి డాక్టర్ అవుల సాయి మహేష్ రెడ్డి తెలిపారు. పశువులకు నులిపురుగు నివారణ మందు, జీవాలకు నట్టల నివారణ మందు అందజేసినట్లు చెప్పారు. ఈ శిబిరాల్లో పశుపోషకులకు గుడ్ మిల్కింగ్ ప్రాక్టీస్, మినరల్ బ్లాక్ తయారీ, పశువుల్లో పేలు, గోమార్లు, పిడుదులు వంటి వాటి నివారణ కోసం మందులు, యూరియా గడ్డి తయారీ, ప్రమాద కరమైన రోగాల నివారణకు వాడవలసిన ఫుడ్‌బాత్ మొదలైన చర్యలను రైతులకు ప్రయగాత్మకంగా అవగాహన కల్పించామన్నారు.



జగ్గాపురంలో శిబిరంలో పాల్గొన్న పశు వైద్యాధికారులు

నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి

బొల్లాపల్లి: ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటలు సాగు చేసే రైతులకు నెలవారీ నిర్వహణ రాయితీలను సక్రమంగా చెల్లించాలని ఉపాధి హామీ పథకం ఏపీడీ బూసిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎవెన్యూ ప్లాంటేషన్ సందర్శించి ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం పండ్ల తోటల పెంపకానికి తగు ప్రోత్సాహం అందిస్తుందని, రైతులు సద్వినియోగపరచుకోవాలని సూచించారు. మినీ గోకులం షెడ్‌ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. మండలానికి 23 గోకులం షెడ్‌లు మంజూరు కాగా వీటిలో 15 పూర్తయ్యాయని, త్వరితగతిన 8 నిర్మాణం చేయాలని సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ పి. సీతారామయ్య, ఏపీఓ లక్ష్మణరావు, సాంకేతిక సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో బహిరంగ వేలం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. సంవత్సర కాలానికి కొబ్బరి కాయలు, పూజా ద్రవ్యాలు విక్రయించేందుకు రూ.22.80లక్షలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కుకు రూ.4.45లక్షలు, అమ్మవారికి సమర్పించే చీరలు, జాకెట్ ముక్కలు సేకరణకు రూ.1.45లక్షలకు పలువురు దక్కించుకున్నారు. పూజా ద్రవ్యాలు, కొబ్బరికాయలు విక్రయించే దుకాణానికి గత ఏడాది కన్నా రూ.85వేలు అధికంగా టెండర్‌లో కాంట్రాక్టర్ దక్కించుకున్నట్టు ఆలయ ఈఓ నలబోతు మాధవిదేవి తెలిపారు. ఈవో బండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపు ఉచిత పిరమిడ్ ధ్యాన శిక్షణ

నరసరావుపేట ఈస్ట్: రెడ్డినగర్‌లోని మైత్రేయ బుద్ధ పిరమిడ్ ధ్యానకేంద్రంలో ఫిబ్రవరి 2వతేదీ ఆదివారం ఒకరోజు ఉచిత ధ్యాన శిక్షణ, ఆత్మ జ్ఞానం బోధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ధ్యానకేంద్రం నిర్వాహకుడు బి.చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. కందుకూరుకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం అభ్యాసకులకు ధ్యాన ప్రసాదం ఏర్పాటు చేసినట్టు వివరించారు.

ధూళిపాళ్ల శ్రీకృష్ణమూర్తి సేవలు ఎనలేనివి

నాదెండ్ల: చిలకలూరిపేట ప్రాంతంలో తొలితరం ఫొటోగ్రాఫర్, స్వాతంత్ర్య సమరయోధుడు ధూళిపాళ్ళ శ్రీకృష్ణమూర్తి సేవలు విలువైనవని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ డాక్టర్ జక్కంపూడి సీతారామారావు చెప్పారు. నాదెండ్ల మండలం గణపవరం శాంతినగర్‌లో శ్రీకృష్ణమూర్తి శతజయంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఏవీ శివయ్య అధ్యక్షత వహించారు. డాక్టర్ జక్కంపూడి సీతారామారావు మాట్లాడుతూ కృష్ణమూర్తి ఉదారవాది, సౌమ్యుడని పేర్కొన్నారు. నటుడిగా, రాజకీయ నాయకుడిగా ప్రజలకు సుపరిచితుడయ్యాడన్నారు. అనంతరం డాక్టర్ జక్కంపూడిని ధూళిపాళ్ల కుటుంబ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకుడు కందిమళ్ళ సాంబశివరావు, చంద్రశేఖరరావు, పారిశ్రామికవేత్తలు మద్ది వెంకటేశ్వరరావు, పేర్ని వీరనారాయణ, సాదినేని హనుమంతరావు, ధూళిపాళ్ళ శ్రీకాంత్, శ్రీనివాసరావు, విజయలక్ష్మీ ప్రసాద్, వెంకటేశ్వరరావు, కాంతారావు, కవయిత్రి అనుమంచి సుజాత, హైకోర్టు న్యాయవాది వలేటి వీరవెంకట లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ హిమంతరావు, కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



గణపవరంలో డాక్టర్ జక్కంపూడిని సన్మానిస్తున్న ధూళిపాళ్ల కుటుంబ సభ్యులు

రైల్వే బ్రిడ్జిపై నూతన స్టీల్‌గడ్డర్లు ఏర్పాటు

శావల్యాపురం: శావల్యాపురం కొంకేరు వాగుపై బ్రిటిష్ వారి హయంలో నిర్మించిన రైల్వే బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన స్టీల్ గడ్డర్లకు కాల పరిమితి పూర్తి కావటంతో నూతన స్టీల్ గడ్డర్ల ఏర్పాటు పనులు రైల్వే అధికారుల పర్యవేక్షణలో శుక్రవారం ప్రారంభించారు. ఇందుకుగాను 200 టన్నుల సామర్థ్యం కలిగిన నాలుగు క్రేన్ల ద్వారా స్టీల్ గడ్డర్లను యుద్ధప్రతిపాదికను ఏర్పాటు చేస్తున్నారు. ఈబ్రిడ్జిపై ఎనిమిది స్టీల్ గడ్డర్లు అమర్చే విధంగా భారీ యంత్రపరికరాలతో పనులు జరుగుతున్నాయి. తొలిరోజు మూడు గంటల వ్యవధిలో నాలుగు స్టీల్ గడ్డర్లు పనులు చేశారు. శనివారం మిగిలినవి అమర్చే పనులు పూర్తి అవుతాయని రైల్వే అధికారులు వెల్లడించారు.



రైల్వే వంతెనపై భారీ క్రేన్‌లతో స్టీల్ గడ్డర్ల ఏర్పాటు పనులు జరుగుతున్న దృశ్యం

మహిళ మెడలో గొలుసు చోరీ

నరసరావుపేట టౌన్: పట్టణంలోని రజకవాడలో శుక్రవారం ఇంటి బయట కూర్చుని ఉన్న కొత్తమాసు పుష్పవతి మెడలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ హేమారావు తెలిపారు.

పార్థసారథి సేవలు అభినందనీయం

నూజెండ్ల(శావల్యాపురం): నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ సహాయకులు శనివారపు పార్థసారథి ఉద్యోగ విరమణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ పి.ఉమాదేవి మాట్లాడుతూ అంకిత భావంతో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందటం అభినందనీయమన్నారు. శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా, ఆరోగ్యంగా గడపాలన్నారు. అనంతరం పార్థసారధిని పూలమాలలు, దుశ్శాలతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో జెడ్డా రామయ్య, పంచాయతీ రాజ్ ఏఈ అల్లాభక్షు, పంచాయతీ కార్యదర్శులు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

డిగ్రీ ఫలితాలలో కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రకటించిన డిగ్రీ మూడవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు వర్సిటీ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. తమ విద్యార్థులు ఎస్.వీరకవిత బీఎస్సీ (ఫిజిక్స్)లో 850 మార్కులకు గాను 822 మార్కులు, ఎస్.అలేఖ్య బీసీఏలో 810, వై.వెంకటనాగలక్ష్మీ బీఎస్సీ (బాటనీ)లో 803, కె.శివనాగ నిఖిల్ కంప్యూటర్ సైన్స్‌లో802, షేక్.మీరా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో 791, రూతు శివహెప్సిబా కెమిస్ట్రీలో 789, వి.వెంకటనాగమల్లీశ్వరీ గణితంలో 650 మార్కులకు గాను 604, షేక్ కరిష్మాబేగం బీకాం కంప్యూటర్స్‌లో 800 మార్కులకు గాను 747 మార్కులు సాధించినట్టు వివరించారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్ కె.వీరరాఘవులు, ప్రిన్సిపాల్ నాతాని, వైస్ ప్రిన్సిపాల్ ఎంఆర్‌కె సతీష్‌బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ డి.యోగేశ్వరరావు, ఎం.బాలకోటేశ్వరరావు అభినందించారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ నాతాని, అధ్యాపకులు

ఉచిత కంటి వైద్యశిబిరం

రొంపిచర్ల: మండలంలోని కొనకంచివారిపాలెం గ్రామంలో శుక్రవారం ఎంపీ రెడ్డి కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 118 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 12 మందికి శుక్లములు మరో ఐదుగురికి కంటిలో పొరలు ఉన్నట్లు నిర్ధారించారు. వీరందరికీ ఉచితంగా కంటి ఆపరేషన్‌లు నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు.



రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాగునీటి ఎద్దడిని అరికట్టాలి

నకరికల్లు: వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవడంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ జి.కాశయ్య సూచించారు. ఎంపీపీ మేచారపు అనురాధ అధ్యక్షతన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పాడైపోయిన తాగునీటి చేతి పంపులకు మరమ్మతులు చేయించాలని కోరారు. పలుచోట్ల వాటర్ పైపులైన్ దెబ్బతిని ఉందని బంగ్లా గడ్డ, సినిమా హాలు బజారు తదితర ప్రాంతాలకు తాగునీటి వసతి పునరుద్ధరించాలని కోరారు. ఆయుర్వేద వైద్యశాల భవనానికి మరమ్మతులు చేపట్టి డాక్టర్ ప్రతిరోజు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ కె.దేవదాసు, పీఆర్ ఏఈ సురేష్, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



సత్రం భూములను కాపాడండి

అమరావతి: లేమల్లె గ్రామ శివారులోని 14వ మైలు సెంటర్‌లో 1931లో గుంటూరు నివాసి తల్లం శాస్త్రులు స్థాపించిన రాఘవేంద్రస్వామి ట్రస్టు భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికుడు ఎస్.శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో తహసీల్దారు డానియల్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ ట్రస్టు స్థాపించి దాని నేతృత్వంలో బాటసారులకు అన్నపానాదులకోసం సత్రం నిర్మించారన్నారు. సత్రం నిర్వహణకు 10 ఎకరాల 52 సెంట్ల భూమిని సమకూర్చినట్లు చెప్పారు. శాస్త్రులు తదనంతరం 2014 వరకు సత్రం శిథిలావస్థకు చేరి పాడుబడిపోయినా ఎవరు పట్టించుకోలేదన్నారు. అమరావతి రాజధానిగా ప్రకటించిన నేపథ్యంలో భూముల రేట్లు పెరగడంతో తామే తల్లం శాస్త్రులు వారసులమంటూ తల్లం వెంకటశేషగిరి, మనోజ్‌కుమార్, శ్రావన్‌కుమార్ ప్రత్యక్షమయ్యారన్నారు. ఈ క్రమంలో బాటసారులకోసం తీసిన బావిని పూడ్చి వేసి, ప్రజల సౌకర్యార్థం నిర్మించిన బస్‌షెల్టర్‌ను కూడా కూలి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారన్నారు. అలాగే సత్రం భూములను అక్రమించి సత్రం స్థలంలో తాత్కాలికంగా నివాసం ఉంటున్న వారిపై దౌర్జన్యం చేసి బయలకు మొత్తం భూములను హస్తగతం చేసుకున్నారని ఆరోపించారు. అధికారులు వెంటనే భూములు అక్రమించిన వారిపై చర్యలు తీసుకుకోవాలని తహసీల్దారుని కోరినట్లు చెప్పారు. బి.వైశుల్ నాయక్, బి.సుధా, ఎస్కే షైగంబర్, ఎం.నాగేశ్వరరావు, రాములునాయక్ పాల్గొన్నారు.



కమిషనర్, టీపీఎస్‌లకు ఉద్యోగోన్నతి

సత్తెనపల్లి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కొలిమి షమ్మి, టీపీఎస్ రిజ్వానా పదోన్నతులు పొందారు. కమిషనర్ కొలిమి షమ్మి గ్రేడ్ 3 నుంచి గ్రేడ్ 2 మున్సిపల్ కమిషనర్‌గా, రిజ్వానా టీపీఓగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కంట్రీ అండ్ ప్లానింగ్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అంతే కాక ఆమెను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. కమిషనర్ షమ్మి, టీపీఓ రిజ్వానాలను మున్సిపల్ ఉద్యోగులు, సచివాలయాల కార్యదర్శులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది శుక్రవారం సత్కరించారు. మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు, డీఈ తోట వెంకటరమణ పాల్గొన్నారు.

కార్మికులకు దుప్పట్లు పంపిణీ

వినుకొండ (నూజెండ్ల): చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ మహిళా పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముందుగా ఉత్తమ కమిషనర్‌గా అవార్డు అందుకున్న మున్సిపల్ కమిషనర్ ఎం.సుభాష్ చంద్రబోస్‌ను దుశ్శాలువా, పూలమాలతో సత్కరించి మెమోంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ. మారుతి వరప్రసాద్, చైతన్య స్రవంతి వ్యవస్థాపకులు గుమ్మడి వెంకటేశ్వర్లు, అందరివాడు సద్దాం, రంగస్థల కళాకారులు రామాపురం వెంకటేశ్వర్లు, ఏఈ ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, జీవనజ్యోతి స్వచ్ఛంద సంస్థ మందా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

నాదెండ్ల: మండలంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్లను శనివారం ఉదయం 6 గంటలకు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ స్వరూపరాణి తెలిపారు. సచివాలయ సిబ్బంది 9420 మంది పెన్షనర్లకు గాను రూ.4,01,23,000లు పంపిణీ చేయనున్నారు.